# పెంచిన ప్రేమ

హాల్లో మెర్క్యూరీ లైటు జిగేలుమంటోంది. ఏ.సి. ఆన్‌లో ఉండడం వల్ల చల్లగా ఉంది. మిత్ర బృందంతో కులాసాగా కబుర్లాడుతున్నాడు మధుబాబు.

వాళ్ల ముందు మందు గ్లాసులుంచాడు నారాయణ.

తలొకరు తలొకటి అందుకున్నారు. చీర్ ఫుల్‌గా చీర్స్ చెప్పారు. కాస్సేపటికి విస్కీ తలకెక్కినట్లుంది. మాటలు తడబడుతున్నాయి. ఫస్ట్ రౌండ్ ముగించి చిప్స్ నోట్లో వేసుకున్నారు.

"ఇది మందా? మురికినీరా? ఎన్ని పెగ్గులు పీకినా మజాయే రావడంలేదు. నాటు నయం. ఛ...రోజు రోజుకూ లిక్కర్ క్వాలిటీ పడిపోతోంది."


మధుబాబు మండిపాటుకు ఫక్కుననవ్వారు మిత్ర బృందం.

"రోజురోజుకు మోతాదు కూడా పెంచాలి"అనుభవజ్ఞుడిలా అభినయిస్తూ అన్నాడు అభినయ్.

"హి-ఈజ్ కరెక్ట్. డోస్ పెంచు బ్రదర్, కిక్కురుమనకుండా అదే వస్తుందికిక్కు." సిగరెట్టు ముట్టిస్తూ అన్నాడు అజయ్.

మధుబాబుని మరింతగా తాగమని ప్రోత్సహిస్తున్న వాళ్ళ నాలుకల్ని చీరేయాలన్నంత కోపం వచ్చింది నారాయణకి. తాగుబోతునాయాల్లు చినబాబును చెడగొడతున్నారు. 'ఉహూం ఇహ ఊరుకోకూడదు' ఉక్రోషంతో ఊగిపోయాడు. కోపంలో అలా అనుకున్నాడేగానీ, వాళ్ళను ఏమన్నా అంటే మధుబాబు ఊరుకుంటాడా? అందుకే ఆగ్రహం వచ్చినా అణచుకుంటున్నాడు.

మధుబాబు అవంతి టెక్స్‌టైల్స్ అధినేత ది గ్రేట్ బిజినెస్ మాగ్నెట్



మంగపతిగారి ఏకైక వారసుడు. అతనికి ఇద్దరు మగ పిల్లలు కలిగినా చివరకు ఒక్కడే మిగిలాడు. పెద్దవాడు పురిట మంచం మీదే కన్ను మూయడంతో రెండో నలుసుని అతి గారాబంగా పెంచి పెద్ద చేశాడు. మధుబాబుకి తోబుట్టువులే కాదు కన్నతల్లి కూడా కరువైంది. విధిలేని పరిస్థితులలో వ్యాపార నిమిత్తం కొడుకుని విడిచిపెట్టి విదేశం వెళ్ళవలసి వచ్చింది మంగపతికి. తిరిగిరావడానికి ఏడాది పైన పడుతుంది. అందుకే మధుబాబు బాధ్యత నారాయణకి అప్పగించాడు వాడా ఇంట్లో ఏనాటి నుంచో పని చేస్తున్నాడు. నారాయణకు చిన్నతనంలో 'నా' అన్న వాళ్ళు లేరు. వారాలు చేసుకుంటూ చదువుకునేవాడు.

భార్య రోగంతో లేవలేని స్థితిలో ఉన్నప్పుడు బిడ్డను చూసుకోవడానికి కుర్రాణ్ణి ఎవరినైనా తెచ్చి ఇంట్లో పెట్టుకుంటే బావుండు ననిపించింది. మంగపతికి. కాకతాళీయంగా నారాయణ కంటపడ్డాడు. చదువుకున్న పని దొరకడంకష్టమని వచ్చిన ఎల్లకాలం బతుకుకోవద్దని ముద్ద పెడుతున్న వాళ్ళే సలహా ఇచ్చారు. దాంతో వాడు చదువుకి స్వస్తిచెప్పి మంగపతి గారింట్లో చేరాడు.

మంగపతి విదేశం వెళ్ళిపోయినప్పటి నుంచి మధుబాబు మందుబాబులతో స్నేహం ఎక్కువైంది. బెల్లం చుట్టూ చీమల్లా వాళ్ళంతా మధుబాబు చుట్టూ పరిభ్రమించసాగారు.

"రెండవ రౌండేదిరా?" మధుబాబు కేకకు పరుగున వచ్చిన విస్కీగ్లాసులు వాళ్ళ ముందుంచాడు నారాయణ.

మధుబాబు గ్లాసు అందుకోబోతే అతని వంక నిస్సహాయంగా చూస్తూ కంటతడిపెట్టాడు. సరిగ్గా ఇరవైరోజుల క్రితం మధుబాబు కడుపు నొప్పితో విలవిలలాడిపోతూ ఉంటే డాక్టర్‌కి ఫోన్ చేశాడు నారాయణ. డాక్టర్ గంభీరం మధుబాబుకి వైద్యం చేశాడు.

గండం గడవడంతో దేవుడికి దణ్ణం పెట్టుకున్నాడు నారాయణ. రోజూ అతిగా మద్యం సేవించడమే మధుబాబు కడుపు నొప్పికి కారణమన్నాడు డాక్టరు... అంతేకాదు తాగుడు తగ్గించకపోతే మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నాడు.

డాక్టరు గారి మాటలకు భీతిల్లిన నారాయణ అతడి చేత ఎలాగైనా తాగుడు మానిపించాలనుకున్నాడు.

మధుబాబుకి తెలివిరాగానే డాక్టర్ హెచ్చరికను గుర్తుచేశాడు.

"వాళ్ళు అలాగే అంటారు. లోకంలో తాగుతున్న వాళ్ళంతా చచ్చి పోతున్నారా?" అడిగాడు మధుబాబు.

"లేదు బాబూ, బతుకుతూ ఛస్తున్నారు. రోగాలతో, రొష్టులతో."

ఇహ చేయగలిగిందేమీ లేకపోవడంతో పెద్దాయనకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించాడు నారాయణ.

అతని మాటలకు షాక్ తిన్న మంగపతి కాస్సేపటికి "ఉన్న ఫళంగా బయల్దేరడానికి నాకు అవదు. నువ్వే ఎలాగో వాడిని కనిపెట్టుకుని ఉండాలి. ఏంచేస్తావో మరి వాడి భారం నీమీదే ఉంచుతున్నాను" అంటూ ఫోన్ పెట్టేశాడు.

కళ్ళు వత్తుకున్నాడు నారాయణ.

"గుడ్. కాస్త ఇంప్రూవ్ మెంట్ కనిపిస్తోంది. బహుశా లిక్కరు తగ్గించి ఉంటారు. మీరిలాగే కంటిన్యూ చేస్తేమరి నా అవసరమే ఉండదు మధుబాబుని పరీక్షించి అన్నాడు డాక్టరు.

అతడు చెప్పిన చల్లని మాటలకు నారాయణ మనసు కుదుటపడింది. ఆవిషయం ఆనందంగా పెద్దాయనకు ఫోన్ చేసి చెప్పాడు.

కొడుకు కోలుకుంటున్నాడని తెలిసి ఊరంత సంబరపడ్డాడా తండ్రి. అంతే కాదు నారాయణికి కృతజ్ఞతలు కూడా చెప్పుకున్నాడు.

ఇలా ఉండగా ఓ రోజు...

ఎప్పటిలాగే మధుబాబు స్నేహితులతో మద్యం పుచ్చుకుంటున్నాడు.

"ఇవాళ దీని అంతు చూడాలి" అన్నాడు సీసాలోని ద్రవాన్ని గ్లాసులోకి వంచుతూ.

"ఐ టూ సీ ద ఎండ్" అన్నాడు అజయ్.

"దాని అంతు మీరు చూసేదేమిట్రా అదే మీ అంతు చూస్తుంది" కసిగా అనుకున్నాడు నారాయణ. మధుబాబును రెచ్చగొట్టడం చూసి సహించలేక. మూడు రౌండ్లయ్యాయి.

నిగ్రహించుకుంటున్నా రెప్పలు వాలిపోతున్నాయి. మత్తులో వాళ్ళు ఇష్టం వచ్చినట్లు వాగుతున్నారు. పగల బడి నవ్వుతున్నారు.

మూడు రౌండ్లయ్యాయి.

అంతా ఔటయిపోయారు.

తన ఫ్రెండ్స్ చేరుకున్న స్థితికి తానెందుకు చేరుకోలేకపోతున్నాడో తెలీడంలేదు మధుబాబుకి. ఉండలేక ఆ మాటే బయటకు అనేశాడు.

"నీకు స్ట్రాంగ్ డోస్ ఉండాలి బ్రదర్, టేక్‌యాజ్ ఇటీజ్" అన్నాడు అభినయ్.

వెంటనే బాటిలు అందుకున్నాడు మధుబాబు.

"వద్దు చినబాబు మీరు తాగొద్దు మిమ్మల్ని ఇక ఈ విషాన్ని తాగనివ్వను" అంటూ అతడి చేయిపట్టుకున్నాడు నారాయణ.

"నువ్వెవడివిరా నన్నాపడానికి. మైండ్ యువర్ బిజినెస్" కోపంతో ఊగిపోతూ అతడి నోత్రోపుత్రోసేసి సీసా ఖాళీ చేసాడు మధుబాబు కింద పడ్డాడు నారాయణ. తలకు గాయమై రక్తం చిమ్మింది. మైకంలో విచక్షణ కోల్పోయిన మధుబాబు నారాయణ స్థితి నేమాత్రం పట్టించుకోలేదు. అతడి అనుయాయులు నారాయణని చూసి విరగబడి నవ్వారు. కారుతున్న రక్తాన్ని చేత్తో తుడుచుకుంటూ లేచి వెళ్ళిపోయాడు నారాయణ.

మధుబాబుకు సీరియస్‌గా ఉందన్న వర్తమానం అందుకుని ఆఘమేఘాల మీద వచ్చాడు మంగపతి. "ఈసారికి ఫరవాలేదు. మరోమారు మళ్ళీస్ట్రోకొస్తే మీవాడిని భగవంతుడు కూడా కాపాడలేడు. దగ్గరుండి అతనిచేతమందు మానిపించే ప్రయత్నం చెయ్యండి" హెచ్చరించాడు డాక్టర్.

మతిపోయింది మంగపతికి.

"ఒక్కగాని ఒక్క వంశాంకురానివి. నువ్వేలేనప్పుడు నా ఈ తపన, ఆస్తిపాస్తులు ఎవరికోసం? నాలుగు కాలాల పాటు నువ్వు చల్లగా ఉండాలంటే ఇక మీదట మద్యం ముట్టనని ఒట్టేసి చెప్పుబాబు" అంటూ కోలుకుంటునన కొడుకు చేయి పుచ్చుకున్నాడు.

"ఇంకెప్పుడూ మందు జోలికి పోనని నీ మీదే కాదు స్వర్గానికెళ్లిన నా కన్నతల్లి మీద కూడా ఆన" అంటూ ప్రమాణం చేశాడు మధుబాబు.

ఆ మాటతో మంగపతి మనసు తేలికపడింది. 'ఇక నిన్ను విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్ళను. ఔనూ, నారాయణ ఏడి? ఎక్కడా కనిపించడేం? దగ్గరుండి నిన్నుజాగ్రత్తగా చూస్కోమంటే నిన్ను ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోతాడా? కృతఘ్నుడు. కుక్కపాటి విశ్వాసం కూడా లేకుండా పోయింది" అంటూ ఆగ్రహాన్ని వెలిబుచ్చాడు మంగపతి.

"నారాయణ్ణి ఏమీ అనకండి డాడీ. ఇందులో వాడి తప్పేంలేదు. నన్ను తాగొద్దని అడ్డుకోబోతే కోపంతో వాడినిబలంగా త్రోసేశాను. తర్వాత వాడేమయ్యాడన్నది పట్టించుకోలేదు. ఆత్మాభిమానం ఉన్నవాడు. అందుకే వెళ్ళిపోయాడు." అంటూ లేచి

కూర్చున్నాడు. అంతలో అతడి తలగడ ప్రక్కన ఏదో కాగితం రెపరెపలాడుతూ కనిపించింది. దానిని అందుకున్నాడు.

"చినబాబూ!

మిమ్మల్ని ఈ స్థితిలో విడిచి వెళ్ళిపోతున్నందుకు నన్ను క్షమించండి. మీరు తాగితే బతకరని తెలిసి మీ చేత మందు మానిపించడానికి నేను ఎన్ని విధాలా ప్రయత్నించేను. నా వల్ల కాలేదు. కనీసం కొంతైనా తగ్గిద్దామని మందు అడిగినప్పుడెల్లా దాంట్లో ఎక్కువగా సోడా కలిపిచ్చేవాణ్ణి మందేవిటీ మురికి నీరులా ఉందంటూ నన్ను ఎన్నోసార్లు కసురుకున్నారు. అయినా బాధపడలేదు. నా ప్రయత్నం పండి మీరు కోలుకోవడంతో నేనెంతగానో సంబరపడ్డాను. అయితే ఆ సంతోషం ఎంతోకాలం నిలువలేదు. మిత్రుల మాటలకు మీరు రెచ్చిపోయి యకాయకి సీసాయే పైకెత్తడంతో నాకేం చేయాలో పాలుపోలేదు. తాగద్దని. బతిమాలుకున్నాను మీరు వినలేదు సీసా లాగి పారేద్దామనుకున్నాను. ఆ పని కూడా చెయ్యనివ్వకుండా నన్ను తోసేశారు. మిమ్మల్ని చిన్నప్పుడు నా భుజాల మీద ఎక్కించుకుని తిప్పాను, మారంచేస్తుంటే మంచి మాటలు చెప్పి గోరుముద్దలు తినిపించాను, నాది మీ పట్ల పెంచిన ప్రేమ. మీకేమైనా అయితే తట్టుకోలేను. పెద్దాయనకు ముఖం చూపించలేను. మిమ్మల్ని ఆ భగవంతుడే కాపాడాలి.

ఇట్లు

నారాయణ

"చూశావా డాడీ! నేను ముందే చెప్పానా? ఇందులో వాడి తప్పేంలేదని" ఉత్తరం తండ్రికి ఇస్తూ అన్నాడు మధుబాబు.

మాటలు రాని ప్రతిమయాయ్యడు మంగపతి.

( 27, జనవరి 2002 ఆంధ్రప్రభ డైలీ )

కథా నిలయం
5401
శ్రీకాకుళం